కథానిక

* మనశ్శాంతి *

శ్రీ వేమూరి వెంకటరామనాథం

కల్నల్ వస్తూనే తన బిసువైన కోటు గుండీలు ఊడ తీశాడు. ఒడలంతా చెమట క్రమ్ముకు పోయింది. ఆఫీసునుంచి అతను నడిచే రావాలి; అదంతా ఒక ఇసుక ఎడారి. దేవుడిచ్చిన కాళ్లుతప్ప ఏ యంత్ర వాహనమూ పనిచేయదా యిసుకప్రమీద. ఆఫీసు సుమారు రెండుమైళ్ళదూరాన ఉంది.

ఉదయం పదిగంటలయింది. ఎండ వేడిమి అప్పటికే దుర్భరంగా ఉంది. వేసవి వడగాడ్పు అప్పటికే విజృంభించింది. ఎడారి ఇసుకలు అగ్నిరవ్వల్లాగా ఎగిరి సుళ్లు తిరుగుతున్నాయి.

కల్నల్ ఆవేళప్పుడు రావటం అసాధారణ విషయం. ఇది ఆమెకు తెలుసు. అది ఆఫీసువేళ. ఆనాడు ఆదివారముకూడా కాదు. పోనీ, యుద్ధ కల్లోలాలు తగ్గిన శాంతి సమయమూ కాదు. పైగా శత్రువులు ఇదివఱకు ఎన్నడూ లేని అవధిని మరఫిరంగులతో, టాంకుదళాలతో, విమాన బలాలతో పెద్ద ఎత్తున విజృంభణ సాగించారని వార్తలు తెలుస్తున్నాయి. దేశానికి అన్నిప్రక్కలా భయంకర రణకలాపమే. ఇరాకుప్రాంతంలో పరిస్థితి నిప్పురవ్వల చెమ్మచెక్కలాటలా ఉన్నదని ఆ ఉదయమే రేడియోలో వార్త.

కల్నల్ వైఖరి ఆమెకు అర్థంకాలేదు. ఆశ్చర్యంతో కనుబొమలు ప్రశ్నపరంపరగా అతనివైపు త్రిప్పింది. అతడు మాటాడేతలంపు లేనట్లుగా కోటు విప్పటంలోనే నిమగ్నుడయ్యాడు. కోటు అందుకొని వంకెకు వేసింది. అతని చేతిలోవున్న కాగితాల సంచీ, చిన్నిచిన్ని ఆయుధాలసంచీ, తీసుకుని టేబిల్ మీద పెట్టింది. గబగబా లోపలికి పరుగెత్తి చల్లని పానీయం తెచ్చియిచ్చింది.

కల్నల్ ఆపాత్ర నందుకున్నాడు. ఒక్క నిమిషంలో ఖాళీ చేశాడు, ఎంత దప్పికగొన్నాడో. గ్లాసు బల్లమీద పెట్టి కుర్చీలోకి తూలి దీర్ఘంగా నిట్టూర్పుతూ, "డార్లింగ్" అన్నాడు.

ఆమె అతనిప్రక్కనే నిల్చొని "ఇప్పుడు వచ్చారేమి కల్నల్?" అన్నది.

నవ్వుతూ అన్నాడు: "నిన్ను చూసిపోదామని."

"అవును, ఆరునెలలనుంచీ నన్ను రోజూ చూసిపోతున్నారు, కాని ఇలాటిఎండవేళ ఎన్నడూ వచ్చేవారుకాదే?"

"అయినా వచ్చాను—"

ఆ మాటలలోని అర్థం ఆమెకు తెలియలేదు. "మఱి, ఆఫీసులేదా యీవేళ?"

"సెలవు పెట్టాను"

"నాకోసమా?"

కల్నల్ ఆమె చేయి పట్టుకుని, "అవును నీకోసమే. ఇదే ఆఖరు దినం మన చెలిమికి. చివరిదినము దినమంతా నీతో గడపటంకన్న ఆఫీసుపని ముఖ్యం కాదనుకున్నాను. ఆఫీసు పని నేడూ ఉంది, రేపూ ఉంటుంది, బహుశా ఎక్కువవుతుందేమో రేపటినుంచి. కాని నీవు నాకు నేడే— రేపు... రేపు..." అంటూ పెదవులెండినట్టు మాటాడలేకపోయినాడు.

ఆమె గ్లాసులో మళ్లా పానీయం పోసింది. వయ్యారంగా పాత్ర నింపే ఆమె వ్రేళ్లు కొద్దిగా వణకినాయి. కల్నల్ అది కనిపెడుతూనే ఉన్నాడు.

పానీయం పుచ్చుకుంటూ, "డార్లింగ్, ఇది ఈవేళ ఎన్నడూ లేనంత మధురంగా ఉంది. ఈ పానీయంలో ఏం కలిపావో కాని" అన్నాడు.

"ఏమీ లేదు. ఇందాక ఇచ్చిందే."

"అవును, కాని యిందులో నీ హృదయం మఱింతగా కరిగిఉంది. నాకోసం నీ ఆరాటం

ఇంగులో మిళితమయిఉంది. అందుకనే యింత తీపిగా ఉంది."

ఇదంతా ఆమెకు అయోమయంగా వుంది. అతని భుజంమీద చేయివేసి "మీ మాటలు నాకు మొదలూ తుదా తెలియటంలేదు," అన్నది.

"డార్లింగ్, సైనికుడి మాటలు అలాగే ఉంటాయి కటువుగా, విప్పకోరానివిగా. నీకు అర్థం కాకపోవు, కాని నీకు ప్రియంగా ఉండవు. బహుశా రేపే నేను ప్రయాణం—"

"ఎక్కడకు?" అంటూ ఆమె అతనికింకా దగ్గరగా జరిగింది. వేటగాడి గురిలోని కోకిలమ్మకూతలా ఉన్నదా గొంతు.

కల్నల్ నిశ్చలంగా పలికాడు, "ఇరాక్."

"ఇరాక్? మఱి నేనో!"

"నీవిక్కడనే ఉండు డార్లింగ్, సుఖంగా. ఇక్కడ మంచు బెందెలు మాత్రమే అక్కడ నిప్పు గుండ్లు కురుస్తూఉంటాయి అనుక్షణము......వద్దు, బాధతో పెదవులు కదల్చకు. నీ బాధ నాకు తెలుసు. కాని ఏం చేయగలను? ఇరాక్ ప్రాంతంలో శత్రు భయం దారుణంగా ఉంది. అనుభవంగల సైనికాధిపతులందర్నీ అక్కడకు పంపుతున్నారు. నన్నూ... నేనే కోరుకొన్నాను కూడ..."

"ఆఁ......నన్ను వదలిపోవాలని కోరుకొన్నారా?"

"కాదు, నీకోసం ఇక్కడే ఉండమంటావు; కాని నిన్ను మించి దేశమున్నది; ప్రభుత్వమున్నది. దేశక్షేమంకోసం, ప్రజాక్షేమంకోసం ఇరాకు పో నిశ్చయించుకొన్నాను."

ఆమె తనూలత కంపించిపోయింది. ఇన్నినాళ్ల వలపుతీపులు ఇగిరిపోయినాయి. ఇన్నాళ్ళ ఆనందం ఒక్క త్రుటిలో చితికిపోయింది. తిరిగి తనకు వెనుకటి ఏకాంత ప్రవాస జీవితమే ప్రాప్తి!

"మఱి నన్ను ఎవరి రక్షణకు వదలిపోతారు, ఈ ఎడారి ఇసుకలలో?"

ఆ ప్రశ్నతో కల్నల్ చలించలేదు. ప్రణయానురాగంతో కరగిపోయే మెత్తని హృదయం కాదతనిది. సైనికానుభూతితో ఘనీభవించి పోయిన నిబ్బరపు రాతిగుండె. ఆలోచనగా అన్నాడు, "డార్లింగ్, నేను రాకముందు ఎవరి రక్షణలో వదలబడి ఉన్నావో, ఆ రక్షణక్రిందనే వదలిపోతాను."

వెన్నెలకాచి వెలిసిన నీలి ఆకాశంలా అయింది ఆమె ముఖం. కల్నల్ అన్నాడు, "క్షమించు డార్లింగ్, ఒక ప్రశ్న అడుగుతాను. నీయిల్లు ఊరికింత దూరంగా ఈ నిర్జనప్రదేశంలో ఉన్నదేం? నీ వొక్కతెవు ఈ యింట్లో ఎంతకాలంనుంచి నివసిస్తున్నావు? ఒంటరిగా ఎలా గడుపుతున్నావు?"

"మంచి ప్రశ్నలు! అవును, తుదినాడు ఏ ప్రశ్నలు వేస్తేనేం, నన్నెలా బాధిస్తేనేం?" అంటూ కంట నీరు పెట్టుకొన్నది.

కల్నల్ కొంచెం చలించాడు. తన రుమాలుతో ఆమె చెక్కిళ్ళు తుడిచాడు. ఆమెమాత్రం కన్నీటి బిందువులు వాకలయేలా వెక్కివెక్కియేడుస్తూ అన్నది, "మీకు కోపం రావటమెందుకు? ఈ దూరస్థలాన మీకోసమే ఉన్నాను. మీవంటి అధికారులు అనుభవించి వదలిపోవటానికే ఉన్నాను. మిమ్మ ఎంతగా నమ్ముకొన్నాను! నా ఆశలన్నీ పటాపంచలుచేసి ఇరాకు పోతున్నారు...ఇరాకట ఇరాకు! ఈ రాతిగుండెల కా యిరాకే—" అంటూ అనీ అనరాని మాటలేవో ప్రలాపించ సాగింది.

కల్నల్‌కు చిరునవ్వు వచ్చింది. ఆమెకు రోషం ఇనుమడించింది. "అలాగే నవ్వండి, ఒక అబలను ఒంటరిగా వదలిపోయే బలవంతులు మీరు. మీ రాచబాట మీది, నా బ్రతుకు నాది—"

కల్నల్ ఆమె వ్రేళ్లతో ఆడుతూ అన్నాడు, "నీ కోర్కె నాతోకూడా ఇరాకు రావాలని కాదూ?"

మెత్తని ఆమె వ్రేళ్ళు వణికిపోయినాయి, కల్నల్ మొరటువ్రేళ్ళమధ్య. ఆమె ఒడలంతా పులకరించింది చక్కలిగింతలు పెట్టినట్లుగా. ఆమె కన్నులు విశాలంగా వికసించినాయి, ఆశ ఫలించినట్లుగా. మెల్లిగా అతని ప్రక్కకు జరిగి, "పోనీ, మీరే ఇక్కడ ఉండరాదూ?" అన్నది.

కల్నల్ లేస్తూ అన్నాడు, "ఊహుఁ...అది అసంభవం. నా ప్రభుత్వ శాసనాన్ని నేను ఉల్లంఘించలేను. కాదు, అది నేను నాపై పెట్టుకున్న భారమే!"

"మఱి యిక్కడమాత్రం సైన్యాధ్యక్షు డొకడుండవద్దా? మీరే—"

"నా స్నేహం, చనువూ కారణంగా ప్రశ్నలు వేసే తెలివితేట లబ్బినట్లున్నాయి నీకు." కల్నల్ నవ్వుతూ అన్నాడు, "కాని, సైనికాధికారిముందు నిల్చుని ప్రశ్నలు వేయటం మంచిదిగాదు."

ఆమె నవ్వుతూ అన్నది, "నేను మీ సైనికుడ నైతే యీ తెలివీ, యీ ధైర్యం ఉండేవి కావు. నేను కేవలం ఒక ఆడుదాన్ని, యౌవనవతిని."

"అందుకే జవాబు ఇస్తున్నాను. నా స్థానే మఱొకరిని నియోగిస్తున్నాను."

"మఱొకరినా? నాకు నవ్వు వస్తోంది. మీ స్థానం మఱొకరు భర్తీ చేయగలరా?"

"నేనంత అసామాన్యుడనా డార్లింగ్? అయితే అందుకే నాఅంతట నేను ఇరాక్ వెళ్లేది. కాని, వెర్రిదానా నీకు తెలియదుగాని నాలాగా తయారవుతున్న యువకు లింకా కొందరున్నారు. ఇక్కడికి రాబోయే మేజర్ మహా మేధావి. పదినెలలుగా సైనిక కార్యకలాపంలో మునిగి ఉన్నాడు. ఉక్కు మనిషి, వజ్రహృదయం, నమ్మినబంటు, మెప్పులందిన సైనికుడు"—

"ఎవరా అదృష్ట పురుషుడు?"

"మేజరు క—"

"ఆఁ...?"

"మేజరు క—"

ఆమె తటాలున బంతిలా తూలిపడ్డది మంచం మీదకు. "మేజరు క—" అనుకుంటూ ఆలోచనగా ముఖం వంచుకుంది. కల్నల్ అది కనిపెట్టలేదు. మేజర్ పై గల అభిమానం, తన విశ్వాసం ఉద్ఘాటిస్తూ ఉపన్యసిస్తున్నాడు. వెనుకటియుద్ధంలో మేజరు ఒకనాడు తన ప్రాణం ఎలా కాపాడింది వర్ణించాడు. "నాటినుంచీ అతనిని నా దళాలలోనే వేసుకొంటున్నాను. అతడే నా దక్షిణభుజం నా బలగమంతటిలోను."

ఆమె మెల్లగా తెప్పరిల్లుతున్నది, ప్రక్కకు త్రిప్పుకొన్న ముఖం మళ్ళీ అతనివంకకు త్రిప్పింది. కల్నల్ ఉత్సాహంగా తన కాగితాలకట్టలలోఉన్న మేజర్ బొమ్మ ఒకటి పైకి తీశాడు; "చూడు డార్లింగ్, ఎలాటి వీరమూర్తియో!" ఆమె అతని వంక కన్నులు మూసుకుచూసింది, ఆమె కనుఱెప్పల లోనూ అదే చిత్రం కనపడినట్లు తోచింది. "ఇది నీవద్ద ఉంచుకో డార్లింగ్ —"

"ఈ ఆడుదాని కాపురుషుని చిత్రం మీ చేతులతో ఎందుకిస్తారు?" అన్నది. ఆ మాటలు విర్చి పేర్చినట్లు విచిత్రంగా ధ్వనించాయి కల్నల్ చెవులలో.

"డార్లింగ్, నీవు స్త్రీవి, ఇతడు పురుషుడు, అన్నదృష్టి ఒక్క క్షణం మఱచిపోలేవా? ఇతడు ప్రఖ్యాతవీరుడు. నా మిత్రుడు. ఇతడు రక్షించేది నీదేశాన్ని, నిన్ను—"

చిత్రం తీసికొన్నది. మంచంపైన తలగడదిండు క్రింద దాచింది. చిన్నపోయిన ముఖంలో తిరిగి కళ కుదురం ప్రవేశించింది. ఆరిపోయిన కన్నీటి మచ్చలు చెంగుతో తుడుచుకుంటూ, "అయితే యీ మేజరు ఎపుడు వస్తాడు?" అన్నది.

"రేపే తన క్రొత్త పదవిని స్వీకరించాలి. కాని పిచ్చివాడు పదిహేను రోజులు సెలవు కోరాడు—"

"ఎందు కిచ్చారు మీరు?"

"ఇచ్చానన్న సంగతి చెప్పకుండానే ఎలా గ్రహించావో చిత్రంగా వుంది. నిజం డార్లింగ్, సెలవు ఇచ్చాను, దేశం ఇంత ఉపద్రవస్థితిలో ఉన్నా. అతడు విధి విరామం లేకుండా నెలల తరబడి యుద్ధరంగంమీద నాలుగు మెతుకులు కతుకుతూ, యుద్ధరంగంమీదనే అంపశయ్యలమీద పవ్వళిస్తూ గడుపుతున్నాడు. అతని మనస్సుకు కొంత శాంతి అవసరమని నిశ్చయించుకొన్నాడు. ఇంటికి పోయి, తన ప్రేయసితో పది రోజులు గడిపివస్తానని వేడుకొన్నాడు—"

"నిజమా? అతని ప్రేయసితో ప్రశాంతంగా-"

"అవును. ఏమలా ఆగిపోయినావు, మాటలారిపోయినట్లు. పాపం అతని భార్య బంగారు బొమ్మట, ముద్దులు కురిపిస్తుందట...ఛ్...అతని భార్యనుగురించి నాకెందుకు... కాని డార్లింగ్, ఆమె ఎంత గాఢంగా ఆరాధిస్తుందో యీ జాతీయనాయకుణ్ణి, ఎంత గాఢంగా అనురాగం వర్షిస్తుందో తన ప్రియుడు ఇన్నాళ్ళకు తిరిగి వచ్చాడని—"

అతని ధోరణికి అడ్డుతగిలి అన్నది. "సరే, అయితే మీరింకా పదిహేనురోజు లుంటా రన్నమాట యీ ప్రాంతాలలో—"

"ఎందుకలా కలత చెందినట్లు అడుగుతావు? ఇందాక చెప్పానుగా రేపే నా ప్రయాణమని—"

గుబురు మబ్బులలో మెఱుపు మెఱసినట్లుగా ఆమె ముఖంలో ఏదో ఆశ లాస్యం చేసింది. "రేపే గదా ప్రయాణం...సరే యీ రాత్రే నేనూ సిద్ధమవుతాను...రాత్రివేళ ఒకసారి రండి—"

కల్నల్ మారుమాటాడలేదు. గ్లాసులో మిగిలిన పానీయం గుటకలు వేస్తూ త్రాగుతున్నాడు.

ఆమె మాత్రం దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు నిల్చుంది కిటికీప్రక్కగా. దూర దూరాలలోకి తొంగిచూసే ఆమె కనుచూపులు హఠాత్తుగా చెదరినాయి. కనురెప్పలు గబగబా అప్రయత్నంగా ఆర్చింది. కల్నల్ దగ్గఱకు వచ్చి, అతని కోటు అతనికి అందిస్తూ, "కల్నల్, మీ ఆఫీసువేళ యిప్పటికే మించిపోయింది—" అన్నది.

"డార్లింగ్, మరిచిపోయినావా? ఈరోజు నేను సెలవు తీసికొన్నాను."

"ఆఁ...అవును...నాకోసమన్నారు కాదూ? అవును." అంటూ చతికిలపడ్డది మంచంమీద—

అయిదు నిమిషాలు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చొన్నారు. కల్నల్ సిగరెట్టు ముట్టించి రకరకాలుగా పొగ వదులుతున్నాడు. ఆ పొగలు రచించే వింత చిత్రాలవంక వెఱ్ఱిగా చూస్తూ నిట్టూర్చుతున్నది ఆమె.

ఇంతలో బైట ఏదో చప్పుడయింది. ఎవరో ఆజానుబాహువు కంటపడ్డాడు. "ఎవరు" అంటూ కల్నల్ గడపలు దిగబోతున్నాడు. ఆమె మాత్రం తలవంచుకొని లోనికిపోయింది, "కాఫీ చేస్తా"నని.

కల్నల్ ఆశ్చర్యంతో తెల్లబోయాడు. "ఓహ్! నీవా మేజర్" అని కౌగిలించుకొన్నాడు. మేజర్ అంతకన్న ఆశ్చర్యంతో తెల్లబోయాడు. "ఓహ్! మీరా కల్నల్, ఇక్కడ" అంటూ కౌగిలి గాఢంగా బిగించుకొన్నారు.

కల్నల్ ఇంటిలోనికి దారితీస్తూ "ఇప్పుడే నీ సంగతి అనుకుంటున్నాము" అన్నాడు.

"ఆఁ... నేను నేడే వస్తానని చెప్పారా? ఉత్తరం వ్రాసే వ్యవధికూడా—"

"ఎవరికి...ఆఁ...మా మేజర్ ఇక ఈ సైన్యాలపై అధికారం స్వీకరిస్తాడని, నేను ఇరాకు వెళ్ళిపోతున్నానని, మా మేజరు వీరుడు, శూరుడు, అని చెపుతున్నాను."

"కల్నల్, నేను అదృష్టవంతుడను" అంటూ కుర్చీమీద కూర్చున్నాడు మేజర్.

"ఏమి?"

"అవును. కల్నల్ అంతటివాడే దయతో నన్ను చూసిపోవచ్చారు. నే నెంతటివాడిని, సామాన్యుణ్ణి మేజరును—"

కల్నల్‌కు ఏమీ అర్థంకాలేదు. అతడిని చూసిపోవటానికి కాదు తాను వచ్చింది. అతడిని చూడటానికి అక్కడికే ఎందుకు రావాలో అతనికి తెలియలేదు. "మేజర్, చాలాదూరం నడచి వచ్చినట్లున్నావు. బాగా అలసిపోయినావు. కొస్త విశ్రమించు. కాఫీ త్రాగుదుగాని" అంటూ ఉండగానే ఆమె కాఫీ కప్పులు రెండు తెచ్చింది. "డార్లింగ్" అంటూ కల్నల్ లేచి అందుకొనేలోగా మేజర్ అవి పట్టుకొని, ఒకటి వానికిస్తూ, చిరునవ్వుతో, "ఆమె నా డార్లింగ్" అన్నాడు.

కల్నల్ కళ్లు తిరిగినాయి. అతని చేతులు వణకినాయి. కాఫీ కప్పు హఠాత్తుగా క్రింది జారి పగిలింది. కల్నల్ వ్రేళ్లు అంత బలహీనంగా ఎన్నడూ లేవు. నెత్తురుముద్దగా పోరాడే అతని ముఖబింబంలో నెత్తురుబొట్టు లేదా క్షణాన.

మేజర్ "క్షమించండి" అంటూ రెండవ కప్పు కల్నల్‌కోసం టేబిల్‌మీద పెట్టాడు. చిరపరిచితుడులా లోనికి పోయి తాను మఱొక కప్పు తెచ్చుకొన్నాడు. కల్నల్‌కు కాఫీత్రాగ బుద్ధి వేయలేదు. అతని మనసు మనసంతా ఒకే ఆలోచనమీద కేంద్రీకరింపబడిఉంది. ఇన్నాళ్ళు తాను ప్రేమిస్తున్నది తన మేజర్ భార్యనా!

మేజర్ తన కథ సాగించాడు. "పాపం నెలల తరబడి ఒంటరిగా ఈ ఎడారి యిసుకలలో ఈ నిర్జన ప్రదేశంలో గడుపుతున్నది. నాకోసం ఎంతగా తపించేదో, ఈ ఏకాకి జీవితాన్ని ఎంత ఓర్పుతో భరించేదో, మీకు తెలియదు కల్నల్, మీరు బ్రహ్మచారులనుకుంటాను, సాంసారిక జీవితంలో ఆనందమున్నది. చెదరిపోయిన మనస్సుకు శాంతిని చేకూర్చే ప్రతిభ ఉన్నది. ఇన్నాళ్లుగా నేను యుద్ధం చేస్తున్నాను, నా హృదయం బండబారిపోతున్నది. నా శరీరం ఉక్కులా మారిపోతోంది. నా హృదయానికి ప్రశాంతి, నా దేహంలో మానవత్వం తిరిగి పులకింపచేసికోవచ్చాను... కాఫీ త్రాగండి, చల్లారిపోతుంది. కల్నల్, ఎప్పుడూ ఒకే కల్లోలమయితే నేను తట్టుకోలేను. ఈ పది నెలలు మనుష్యులను చంపటం, చంపినవారిని లాగివేయటం......ఇదేగదా నా దినచర్య. ఈ పదునైదు దినాలైనా హృదయాన్ని పగిల్చే గాథలు దృశ్యాలు లేకుండా శాంతిగా నా ప్రేయసితో గడిపివస్తాను......ఏం కల్నల్, కాఫీ ముట్టుకోనే లేదు. పంచదార ఎక్కువ అయిందా? మా కాఫీ మీ కలవాటు లేదుగా, క్షమించాలి."

మేజర్ పలికే ప్రతి పలుకు తట్టుకోలేని ఫిరంగి గుండులాగా తగులుతున్నది కల్నల్ హృదయానికి. ఇన్నాళ్లూ కల్నల్ ఆమెను తన ప్రేయసిగా నమ్మాడు. ఆమె కన్య అన్న అసత్యాన్ని విశ్వసించాడు. ఆమె ప్రణయ సముద్రంలో నౌకలా తేలిపోతున్నాడు. ఈనాటికి మేజర్ అవతరించాడు తన పాలిటి యమ—బోటులాగా. తాను వంచింపబడినందుకు ఆమెపై కోపంతో వణకిపోయాడు. కాని మేజరు ముందు తనకు అవమానం అవుతుందన్న భయంతో చిన్నబోయాడు. రెండు కనులూ నిండుగా తెఱచి మేజరువంక చూడలేకపోయాడు. తనకు దక్షిణ హస్తమైన నమ్మినబంటు ఆ మేజరు; తన స్థానే నిలిచే యోగ్యతగల ఏకైక సైన్యాధ్యక్షుడు ఆ మేజరు; ఆరు నెలలుగా తాను ప్రేమించిన ఆ కాముకివినా తన వాత్సల్యానికి ఆ మేజరువలె పాత్రులయిన వారు లేరీ విశాల ప్రపంచంలో. కాని ఆ మేజరు భార్యమీదనే కల్నల్ వలపు లొలికించాడు. ఆ మేజర్ శయ్యనే తాను హరించాడు. ఇన్నాళ్ళ ప్రణయానుభూతీ, ఆనందలహరీ ఆక్షణాన దారుణమైన కూపంలా కనుపటింది కల్నల్ మనోనేత్రాల ముందు. అతడేమైనా అనుకుంటాడన్న స్నేహధర్మం చేత కాఫీ రుచి చూశాడు.

"కల్నల్, మీరెంత మంచివారో నేను చెప్ప లేను."

"నామంచితనం! ఏడిచిందిలే మేజర్."

"కాదు. ఇవి సెలవుదినాలు. ఈ నాలుగు రోజులూ నా మనసులోని కృతజ్ఞతను స్వేచ్ఛగా బైటకు చెప్పుకోవచ్చుగా. మొట్టమొదట ఆఫీసులో పుకారు పుట్టింది, మీరు నా సెలవు చీటీని త్రిప్పి కొట్టారని—"

అప్రయత్నంగా, మెల్లగా "త్రిప్పి కొట్టినా బాగుండేది" అని గొణిగాడు కల్నల్.

"క్షమించండి, నవ్వులాట కంటున్నారు కల్నల్. యుద్ధ కార్యకలాపం నానాటికి హెచ్చుతున్నదన్న మిషమీద నన్ను వదలలేమన్నారని నా స్నేహితులందరు నన్ను భయపెట్టారు."

"మేజర్, వాళ్లు చెప్పింది నిజమే. దేశక్షేమం కోసం నేను సెలవీయదలచుకోని మాట వాస్తవమే. కాని—"

"మరి తుదకు అనుగ్రహించారు! అదే తమ మంచితనమంటాను! అంటూ నవ్వాడు మేజర్. సిగరెట్టు ఒకటి కల్నల్‌కిచ్చి తానొకటి వెలిగించాడు.

"కాను, అది నా మంచితనం కాదు మేజర్, కేవలం దేశక్షేమంకోసమే నీకు సెలవు అనుమతింప నిశ్చయించాను. నీకు మనశ్శాంతి కావాలని నాకు తెలుసు. కల్లోలం లేని గృహంలో పువ్వులపాన్పుపై, పూజించే ప్రేయసితో, పదిరోజులు నీవు గడిపివస్తే, నీ ఉత్సాహబలాలు పదిరెట్లు అవుతాయని నీ చెలిమిలోని దగ్గఱతనం చేత నేను గ్రహించాను. వెంటనే నీ సెలవు మహజరుపై సంతకం చేసి పంపాను."

"ఎలాగైతేనేమి — మీకు నేను కృతజ్ఞుణ్ణి. ఎందరు లేరు నాతోడివారు, సెలవు దొరకక చిన్నబుచ్చుకొన్నవారు!...ఏంకల్నల్, దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? ఒక కప్పు వేడి కాఫీ తెప్పించనా?... డార్లింగ్!"

కల్నల్ నిశ్చితంగా "వద్దు" అన్నాడు. మేజర్ పిలిచిన "డార్లింగ్" కల్నల్ ప్రాణానికి నిశితమైన శూలాలంలా గుచ్చుకున్నది. "వద్దు మేజర్, ఆమెకు చెప్పు, కప్పుతీసుకు ఇక్కడికి రావద్ద"ని.

రెండుమూడు నిమిషాలు నిశ్శబ్దం ప్రాకులాడింది ఆ సైనికాధ్యక్షులమధ్య. ఆ క్షణిక నిశ్శబ్దావస్థలో కల్నల్ మనసులో ఆలోచనాతరంగాలు రేగుతూ, మేజర్ జీవితాన్ని ఉయ్యాల లూగింప చేస్తున్నాయి.

మేజర్ పొగవదులుతూ, ఆకాశంవైపు చూస్తూ, "కల్నల్, ఆకాశం చూడండి, రక్తగర్భంలా మండిపోతోంది. పది దినాలనాడు మనం—రంగంలో శత్రుదళాన్ని చావమోదిన అద్భుత దృశ్యం జ్ఞాపకం వస్తోంది...అసలు ఈ వేసవి ఆకాశం తీరే యింత... ఆ సూర్యుడుమాత్రం—" అంటూ ఏదో అనవసర ధోరణి మొదలుపెట్టాడు.

కాని కల్నల్‌కా సంభాషణలో కుతూహలం లేదు సరిగదా, అతని మనస్సే ఆ మండిపోతున్న ఆకాశంలాఉంది. ఈ ఆరునెలల జ్ఞాపకాలూ భగభగా జ్వాలలు రేగిపోతున్నాయి. మేజర్ చివరకు అన్నాడు. "కల్నల్...ఈ మాటలలో మీకు ఆసక్తి లేదనుకుంటాను—"

"అవంతా వ్యర్థప్రసంగం మేజర్. ఒక్కదినం సెలవుమీద ఉన్న నావంటివాడికి వ్యవధిలేదు అలాంటి సంభాషణలకు," అన్నాడు కల్నల్—అకస్మాత్తుగా కల్నల్ కంఠం కఠోరమయిపోయింది. అలా అతడు ఆఫీసులోనే మాటాడుతాడు. ఆ గొంతు దాల్చడంచే అతనిలో ఏదో మథన జరుగుతున్నట్లు,

అతడేదో నిశ్చయానికి వస్తున్నట్లు—అది ఇక చండ శాసనమని మేజర్‌కు బాగా అనుభవం.

"అవును," మేజర్ అన్నాడు. "పదునైదు దినాల విశ్రాంతి గైకొన్న నాబోటివానికి కొంచెం వ్యవధి ఉంటుంది, కాని—"

కల్నల్ సిగరెట్టు పీల్చుతూ, "నీకూ లేదు" అన్నాడు.

మేజర్ కలవరపడ్డాడు! తటాలున లేచి, "కల్నల్, ఇది నా సెలవులో మొదటి దినం. ఇంకా—"

కల్నల్ కూడ లేచాడు, "ఇదే తుది దినం కూడ. తిరిగి ఆర్డరు వేస్తున్నాను, నీ సెలవు ఉపసంహరింపబడినదని."

మేజర్ గుండెలు జారినాయి. "ఆఁ...ఉపసంహరించారా? మరి నాకు విశ్రాంతి అవసరమని మీరే ఒప్పుకొన్నారే, నాకు మనశ్శాంతి నా గృహంలో నా ప్రేయసివద్ద కలుగుతుందని మీరే అంగీకరించారే—"

"మేజర్ !"—కల్నల్ అంత కఠినంగా యుద్ధరంగంలో మాత్రమే ఉచ్చరిస్తాడు, లేదా ఎదురు తిరిగిన ఉద్యోగిముందు అంటాడు. "మేజర్, అవన్నీ నాకు తెలుసు. నీకు సెలవు అనుమతించటం అనుచితమని ఇప్పుడు గ్రహిస్తున్నాను. దేశక్షేమం కోసం నీవు వెంటనే కత్తిబట్టి రంగంమీదకు దూకాలని శాసిస్తున్నాను."

మేజర్ కాళ్లు బలహీనమయినాయి, నిల్చొనలేక కూలబడ్డాడు, మంచంమీద—"కల్నల్, పోనీ ఒక్క వారం పాటు...నా భార్యతో—"

కల్నల్ మళ్లా హుంకరించాడు, "మేజర్, నీ భార్యమాట నాముందెన్నడు ఎత్తకు, నేను రేపే ఇరాక్ ప్రయాణం. నిన్నూ నాతోనే తీసుకుపోతాను."

"ఇరాక్ ?"

"అవును." కల్నల్ గొంతు తగ్గించాడు; మృదువుగా అన్నాడు, అతని భుజాలు తట్టుతూ, "మేజర్, నీవు నా దక్షిణభుజానివి, నేనే నీకు శాంతి, నీవే నాకు శాంతి."

మేజర్ సెల్యూటు చేశాడు. కల్నల్ కోటు తొడుక్కొంటున్నాడు. మేజర్ భార్య కాఫీ గ్లాసు తెచ్చి కల్నల్ కీయబోయింది. "వద్దు" అన్నాడు నిశితంగా. "పోనీ, ఒక్క ప్రార్థన మన్నిస్తారా?" అన్నది.

"ఏమిటి" అని హుంకరించాడు కల్నల్.

"వారికి ఈ ఒక్క రాత్రి గడువీయండి. రేపు మళ్లా ఉద్యోగము—"

కల్నల్ ఒక్క నిమిషంసేపు ఆలోచించాడు. కనుబొమలు ముడులల్లుకుపోయినాయి మెల్లగా నిట్టూర్చుతూ, "సరే" నన్నాడు. ఆనందంతో మేజర్ మంచంపై ఒరిగాడు. కల్నల్ సందిగ్ధంగా బైటకు సాగాడు. మేజర్ భార్య వాని వెంట నడచింది.

తలవంచుకొని అడిగింది, "రేపేనా మీ ప్రయాణం?"

"అవును," తల త్రిప్పకే సమాధానమిచ్చాడు.

"ఒక్క సారి రాత్రి దయచేయండి నేనూ—" తటాలున కల్నల్ ఆమెవంక పరిశీలనగా చూశాడు. ఒకనిమిషమాగి, కల్నల్ దీనంగా ఆమెను బ్రతిమాలాడు, "మేజర్‌తో మాత్రం ఈ విషయం పొక్కనీయకు. నీకు పుణ్యముంటుంది నాకు అవమానం—"

"మేజర్ కిది తెలియనే తెలియదులెండి" అంటూ ఆమె సంతోషంతో తల త్రిప్పింది. అతను వెళ్ళిపోయినాడు.

*　　　*　　　*

అర్ధరాత్రి పన్నెండుగంటలయింది. మామూలుగా కల్నల్ నిదురించే సమయమది. కాని ఆనాడు అతని కనులు మూతపడనే లేదు, అతని ఒడలంతా ఏదో తాపం పొందినట్లుంది.

మంచందిగి బైటి చావడిలో పచార్లు చేయసాగాడు. రెండుమూడు నిమిషాలు అటు ఇటు తిరిగాడో లేదో, తనముందు ఒక స్త్రీమూర్తి ప్రత్యక్షమయింది. తటాలున వెనుకంజ వేశాడు. ఆమెవంక చూస్తూ, "డార్లింగ్" అనబోయి పెదవి కొరుకొన్నాడు.

"కాదు, ఆమె దాసిని"

"ఎందుకిటు వచ్చావు? ఆమె పంపిందా?"

"లేదు."

"మరి—"

"పని ఉన్నది," అంటూ తల వంచింది.

"ఈ అర్ధరాత్రివేళ నాతో నీకేం పని?" అంటూ కల్నల్ తిరిగి పచార్లు చేయసాగాడు.

దాసి, వెంట నడుస్తూ అన్నది, "నాకు కాదు, మీకే చేతినిండా పని."

కల్నల్ అర్థం కాలేదన్నట్లుగా ఆమెవంక తేరి పారచూశాడు. ఆమె అన్నది, "రండి, నావెంట రండి."

"ఎందుకు?" అంటూ కల్నల్ చావడి అరుగు మీద కూర్చున్నాడు.

ఆలసించే వ్యవధి లేదు. ఎదురు ప్రశ్నలు వేయటం సైనికులకు చెల్లదు" అంటూ ధైర్యంగా నవ్వింది.

క్రిందివారి మాటలు కొన్ని వేళలలో క్లిష్టంగా ఉన్నా, అందులో సత్యం ఉండకపోదని కల్నల్‌కు తెలుసు. అతడు అధికారం చెలాయించే ఇనుప యంత్రమే కాదు. ఎదుటివారిని అర్థంచేసికొనే సహృదయుడు కూడ.

దాసీది మళ్లా మొదలుపెట్టింది, "ఇంకా లేవ రేమి? ఇదే యుద్ధరంగంలో మీ జెనరల్‌గారి ముందు అనుకోండి. ఇలా ఉదాసీనంగా—"

కల్నల్ నవ్వుతూ లేచి, "ఈ క్షణాన నీవు నా జెనరల్‌వు. అంతటి క్లిష్టస్థితి యేదో సంభవించిందని నమ్ముతున్నాను. పద" అంటూ క్షణంలో తయారయి నాడు తన బాకు మొదలయినవి అలంకరించుకొని.

దాసీది దారితీస్తూ, "కల్నల్, ఆడువారి పిలుపున వస్తూ ఈ బాకుకూడ దేనికండీ మోసుకు రావటం?" అన్నది.

"మంచి ప్రశ్న వేశారు జనరల్" అన్నాడు పెద్దపెట్టున నవ్వుతూ కల్నల్. ఆమెకూడా నవ్వింది. ఈ నవ్వులలో ఒక అరమైలు నడిచారు అప్పుడే. కల్నల్ క్రమంగా గభీరవదనం దాల్చాడు, "ఇంతకు, ఈ నవ్వుల ఉపోద్ఘాతమంతా ఏ విషాద సన్నివేశానికి చెందినదో చెప్పు—" అన్నాడు.

దాసి కల్నల్‌దగ్గరకు వచ్చి వాని బుజం తాకీ తాకనట్లు ప్రక్కనే నడువసాగింది. "కల్నల్, వినండి—"

కల్నల్ అడ్డగించాడు, "ఆఁ—ఈ దినమంతా ఎలా గడిపారు మేజర్, అతని డార్లింగ్?"

దాసి నిట్టూర్చుతూ అన్నది, "కలిసి గడిపినట్లే లేదు. మాటాడినట్లు కూడ తోచదు. మధ్యాహ్నం భోజనం కాగానే ఆమె బజారుకు పోయింది, ఏవో మందులు కొనుక్కొని రావాలని—"

"మందులా, ఎవరికోసం?"

"హుఁ...నాకోసమయినా బాగుండును. శ్.. అవేం మందులో కల్నల్, మూతలు తెరిచేసరికి గుప్పున భరించరాని వాసన కొట్టినాయి. నేను నిల్వ లేకపోయినాను అక్కడ. ఆమె మాత్రం పట్టుదలతో అది తెరచింది, కలిపింది, ఏదో...అబ్బ—"

"త్వరగా చెప్పు, ఇల్లు చేరుకుంటున్నాం—"

"ఆఁ...అసలు సంగతి చెప్పనీయండి. తన దుస్తులన్నీ సర్దుకొన్నది. తన దోమతెర కూడ మడత పెట్టుకొన్నది. ఇరాకులో దోమలబాధ జాస్తిటగా—"

"శ్...అదికాదు అసలు విషయం—" అన్నాడు కల్నల్, ఆమె చేయి తన బాకువరతో తట్టుతూ.

"అవునవును. అలసిపోయి వచ్చినట్లున్నారు మేజర్; పైగా నేటితోనే సెలవు ఆఖరుకూడా. నేమో; పెందలకడనే తన గదిలో పండుకొన్నారు" వారు రాత్రి రెండుగంటలవేళ ఒకమారు లేచి, పానీయం పుచ్చుకునే అలవాటు...వారి ప్రక్కనే బల్లపైన పాత్రలో నీరు నింపి, కల్నల్ అందులో తాను కొన్న—"

"నిజంగానా?" అంటూ కల్నల్ మిగతా కథ నంతా ఊహించినట్లు తొందర తొందరగా నడువ నారంభించాడు.

దాసీది వెనుకపడి ఏదో చెపుతూనే ఉన్నది. అవేమీ అతడు విన్నట్లులేదు. ఉండిఉండి ఒక్క మారు అడిగాడు, "ఆఁ...మేజర్ బ్రతికే ఉన్నారుగా—"

"ఇంతవఱకు హాయిగా నిద్రిస్తూనే ఉన్నారు. ఎంత అయింది?"

కల్నల్ గడియారం చూసుకున్నాడు, ఆనందంతో ముఖం వికసించింది. పరుగుపరుగున మేజర్ ఇంటిలో ప్రవేశించాడు.

క్రింది భాగమంతా చక్కగా సర్దబడిఉన్నది. మేజర్ సామానులుమాత్రం అటు ఇటు పడిఉన్నా, కట్టిన మూటలు కట్టినట్లే ఉన్నాయి. ఆమె సామానులు చాలవఱకు పెట్టెలలో, సంచులలో భద్రపరుపబడి ఉన్నాయి.

కల్నల్ చరచరా పైకి నడిచాడు. మేజర్ పరున్నది మెట్లప్రక్క మొదటి గది. ప్రవేశిస్తూనే టేబిల్ పైని నిండుపాత్ర తిలకించాడు. ఎంతో తృప్తిగా గాఢంగా నిట్టూర్చాడు. నిదురించే మేజర్

ముఖంపై తన ముఖం పెట్టి చూచాడు. అమాయకంగా విశ్రాంతి తీసుకొంటున్న జీవచిహ్నాలు చిందులాడుతున్నాయి. ఆనందంతో ప్రక్కకు తిరిగాడు.

ఇంతలో వెనుకపడ్డ దాసీది మెట్లు ఎక్కి, రొప్పుకుంటూ గదిలోకి ప్రవేశింపబోతున్నది. కల్నల్ తటాలున తలుపు దగ్గఱకు పోయి, "నీవు క్రిందనే ఉండు" అన్నాడు.

దాసి వెక్కి వెక్కి ఏడుస్తూ, "నన్ను కూడ ఇక్కడ ఉండనీయండి" అని బ్రతిమాలుకుంది.

"వద్దు క్రిందకు పో" అని చప్పున తలుపు బిగించాడు.

మళ్లా పానీయపాత్రవద్దకు వచ్చాడు. అది పైకెత్తి వాసన చూశాడు. విషవాయువులకు క్రొత్తవాడుకాని కల్నల్‌కు ఆ ద్రావకమెంత విషమయమో, అది త్రాగినవానికి మృత్యుపరిష్వంగమెంత సన్నిహితమో అర్థమయినాయి. పాత్రి కుడిచేత పట్టుకొని, తన గడియారంవంక చూసుకొన్నాడు. ఒంటిగంటన్నర...హుఁ!...అరగంట దాటితే ఈపాత్ర ఖాళీ అయి ఉండేది, మేజరు ప్రాణాలుకూడ...

మెల్లగా ప్రక్క గదిలో ప్రవేశించాడు. 'డార్లింగ్' తన సిగ్గులేని ముఖం చేతులతో కప్పుకొని నిద్రిస్తున్నది. బహుశా సుఖస్వప్నాలు కంటున్నదేమో, మేజర్ మరణించినట్లు, తాను ఇంటికు పోయినట్లు, ఇంకా అధికారులను వంచించినట్లు... మెల్లగా దీపం పెద్దది చేశాడు.

ఆమె తనకొనర్చిన అవమానంతో మండిపోతున్నాడు కల్నల్. తన భర్తను, కాదు ... ఒక మేజరును, కాదు ... తమ దేశాన్ని రక్షించే అసామాన్య సైన్యాధ్యక్షుని, సునాయాసంగా చంపి వేయనెంచిన దన్నభావానికి పిచ్చియెత్తి పళ్లు పటపట కొరికాడు. ఇలాంటి స్త్రీకి పరాయిపురుషులు, కల్నల్సు కాదు జనరల్సుమాత్రం, లెక్క ఏమిటి అన్న ఆలోచనతో వణకిపోయినాడు. ఈ పాపిష్ఠి కథ అంతా వింటే మేజర్ దేశానికి ఇంకా ఉపయోగపడే మనస్థితిలో ఉంటాడా అన్న సందియంతో చిందులు వేశాడు.

ఇలా ఆలోచిస్తూనే క్షణాలు గడిచిపోతున్నయ్; ఇంతలో ఆమె లేచింది. అతన్ని చూసింది. అతనిచేయి అందుకొనబోయింది, "అఁ...వచ్చారా," అంటూ.

అతడు ఒక అడుగు వెనుకకు వేశాడు. ఆమె అన్నది, కల్నల్, ఇంకా ఒక్క అరగంట ... దీపం చిన్నది చెయ్యండి. ఈ యింటిలో ఉన్నది మన మిద్దరమే కా దీక్షణాన...కల్నల్, ఇంకొక్క అరగంట" అంటూ మెత్తని దిండు తన వక్షస్థలంమీద హత్తుకొన్నది.

కల్నల్ ఏమీ మాటాడలేదు. అతని మౌనం అర్థంకాక, "కల్నల్, దాహం, ఈదినమంతా ఒకటే దాహం", అన్నది.

కల్నల్ ఒక అరనిముసమూగాడు. దీపం చిన్నది చేశాడు. కూజాలోని నీరు కొంత ఆ పాత్రలోపోసి ఆపాత్ర ఆమె చేతి నుంచాడు. అది అందించే అతని వ్రేళ్లు వణకినాయి.

వలపు కలలు కంటున్న ఆమె ఆప్యాయంగా పానీయం త్రావుతోంది. కల్నల్ అన్నాడు, "దీంతో నీదాహం తీరుతుంది—"

ఆమెకు కళ్ళు తిరిగినాయి. గుండెలు కొట్టుకున్నాయి. నరాలు స్వాధీనం తప్పిపోతున్నట్లున్నది. "కల్నల్...కల్నల్......ఇదెక్కడి పానీయం? అబ్బ...ఏమి టినంతా చీకటి? కల్నల్......మీరున్నారా నా ప్రక్క...కల్నల్...డార్లింగ్ అనండి. ఒక్కసారి డా...డా...అఁ..." ఇక ఆమె నోట మాట రాలేదు.

ఒక నిముసమూగి కల్నల్ దీపం పెద్దది చేశాడు. ఇక పాపం చేయలేని ఆమె పెదవులు, బుగ్గలు, కన్నులు, ముంగురులు చూసి రెండు అశ్రుకణాలు వదిలాడు. మళ్ళా దీపం తగ్గించాడు. యుద్ధరంగాన్ని గెల్చుకొన్న యోధుడులాగా మేజర్ గదిలో ప్రవేశించాడు.

గడియారం టంగుటంగున రెండు గంటలు కొట్టింది. మేజర్ కళ్ళు నులుముకొంటూ "డార్లింగ్ దాహం—" అన్నాడు. సమాధానం లేదు. కనులు నులుపుకొంటూ లేచి కూర్చున్నాడు. తన ఎదురుగా తన డార్లింగ్‌కు బదులు తన కల్నల్ ఉన్నాడు. "మీరా?" అంటూ తొట్రుపాటుగా మంచం దిగాడు.

కల్నల్ గంభీరంగా సంబోధించాడు "మేజర్" అని.

మేజర్ గడియారం చూస్తూ, "అవును, నా సెలవు గడువు అయిపోయింది. పండ్రెండు దాటింది. నిన్న గతించింది. నేను మళ్ళా నేను మీ సేవకుడను. ఇక వేకువ గడియలు వస్తాయి నన్ను ఇరాకు తీసికొనిపో వచ్చారు కాదూ కల్నల్?" అన్నాడు.

కల్నల్ నిశ్చలంగా "అవును" అన్నాడు.

"నేనూ సిద్ధమే. తెచ్చిన మాటలు తెచ్చినట్లే ఉన్నాయి. ఒక్క నిముసం ఆగండి. నా డార్లింగ్‌ను చూసివస్తాను" అంటూ ఆగదిలోకి పోయినాడు. వెను వెంటనే కల్నల్ కూడ నడిచాడు.

"మేజర్ తడబడుతూ, "నన్ను ఏకాంతంగా–"

కల్నల్ అన్నాడు, "ఫరవాలేదు."

మేజర్ మెల్లగా దీపం హెచ్చించాడు. తన డార్లింగ్ వంక చూశాడు. కల్నల్ వైపు చూస్తూ, "కల్నల్, కల్నల్...ఇదేమి, ఆ పెదవులంత చల్లగా నల్లగా ఉన్నాయి?" అన్నాడు.

కల్నల్ మాటాడలేదు. మేజర్ మళ్ళా రెట్టించాడు, పెదవుల దగ్గరగా తన ముఖం వంచుతూ.

మేజర్, ఆ పెదవులు ముద్దు పెట్టుకొనకు. అవి విషంలో తడిసినాయి."

మేజర్ మంచంపైన తూలిపడి, "విషమా? నా డార్లింగ్ విషం త్రావిందా?" అన్నాడు.

"అవు"నన్నాడు కల్నల్.

"కాని కల్నల్, మీరు అనుభవశాలులు, చెప్పండి, ఎవరైనా విషం తమంత తామే త్రావుతారా?"

"ఊహుఁ..."

"మరి నా డార్లింగుకు—కల్నల్! విమాన దాడిలో కూడ నేనిలా వ్యథ చెందలేదు కల్నల్! అసలు మీ రిచ్చట ఎలా ఉన్నారీ నడిరేయి" అంటూ లేచాడు మేజర్.

కల్నల్ దీపం తగ్గించాడు. గది బైటకు దారి తీశాడు. మేజర్ వెంట నడుస్తూ, "ఏం కల్నల్?" అన్నాడు.

కల్నల్ కల్నల్‌గా నిలిచాడు. బిగ్గరగా "మేజర్"! అని సంబోధించాడు. "నేను కల్నల్‌గా అడుగుతున్నాను. నీవు మేజర్‌గా సమాధానమియ్యి. ఒక సైన్యాధ్యక్షునికి ఘోరమైన వంచన చేసినవారి నేమి చేయాలి?"

"కాల్చి వేయాలి"

"ఒక సైన్యాధ్యక్షునికి విషప్రయోగం చేసి చంపజూచిన వారి నేం చేయాలి?"

"కాల్చి వేయాలి."

కల్నల్ గొంతుమార్చి, మేజర్ వీపుపై తట్టి, "మేజర్, నేను నీ మిత్రుడను, నిన్ను కాపాడాను," అన్నాడు.

మేజర్ కన్నీరు కారుస్తూ, "కల్నల్, నన్ను క్షమించండి నా భార్య దోషాలకు" అన్నాడు. మరుక్షణంలో వాని చేతులు వదల్చుకొని, కల్నల్‌కు సెల్యూట్ చేస్తూ అన్నాడు "మిగత కథ చెప్పవద్దు. నాకు అశాంతి కూర్చవద్దు...కల్నల్ నేను మీ మేజరును. నాకు శాంతి మీలో, యుద్ధరంగంలో. నా శెలవు త్రుంచివేసి నన్ను బ్రదికించారు. నన్ను ఇరాకు తీసికొనిపొండి."

మేజర్ తలుపుతీసి క్రిందకు దిగబోయినాడు. దాసీది ఏడుస్తూ మెట్లమీదనే నిల్చునిఉన్నది. "కల్నల్, నన్ను ఈ ఎడారి ఇసుకలలో పూడ్చి పోతారా, ఒంటరిదాన్ని చేసి?"

కల్నల్ ఒక్క క్షణం ఆలోచించాడు. "సరే నీవూ మాతో రావచ్చు. మా దళాలలో నర్సుగా పనిచెయ్యి. కాని—" కల్నల్ గొంతెత్తి బాకుమీద చేయి వేసి "మీ యజమానురాలిలా ప్రవర్తిస్తే నిలువున ప్రాణాలు కోల్పోతావు" అన్నాడు.

మరునాటి తొలిసంజలు ప్రసరించక పూర్వమే వేడి చల్లారిన ఆ యిసుకకుప్పలు దాటిపోయినారు వారు ముగ్గురు.